క్లుప్తంగా

పేదలకు అన్నదానం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ఆకలితో ఉన్న నిరుపేదల ఆకలి బాధలు తీరుస్తూ.. వారికి బాసటగా కల్లే లలితా చారిటబుల్ ట్రస్ట్ నిలుస్తుందని ఆ ట్రస్ట్ అధ్యక్షుడు కల్లే నాగేశ్వర రావు అన్నారు. సింగ్‌నగర్ రైతుబజార్ వద్ద కల్లే లలితా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద ప్రజలకు బుధవారం అన్న సమారాధన కార్యక్రమం జరిగింది. దీనిలో పాల్గొన్న నాగేశ్వర రావు మాట్లాడుతూ ఆపదలో ఉన్న పేద ప్రజలను ఆదుకోవాల్సిన బాధ్యత సమాజంలోని ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ముందుగా ట్రస్ట్ డైరెక్టర్లు కల్లే సీతా మహాలక్ష్మి, జయదుర్గ, మేఘవాణిలు పాల్గొని కల్లే లలిత చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

నేడు వెన్నెల పారాయణ

మధురానగర్(విజయవాడసెంట్రల్): రామకృష్ణాపురంలోని శ్రీ అలమేలు మంగ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో గురువారం వెన్నెల పారాయణ, దీపాలంకరణ సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఫాల్గుణ పౌర్ణమి శ్రీలక్ష్మీ దేవి జన్మించిన రోజు కావడంతో సాయంత్రం 6 గంటలకు శ్రీ లక్ష్మీ సహస్రనామ పారాయణ, దీపాలంకరణ సేవ నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాల్సిందిగా వారు కోరారు.

న్యాయవాది జయరాజ్‌కి ఘన నివాళి



విజయవాడలీగల్: న్యాయవాది కోట జయరాజు ఆకస్మిక మృతికి సంతాపంగా బెజవాడ బార్ అసోసియేషన్ ప్రాంగణంలో జయరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షత వహించి ప్రసంగిస్తూ కోట జయరాజు అజాత శత్రువని కొనియాడారు. హెల్మెట్ లేకపోవడం వల్ల ఎన్నో ప్రాణాలు పోతున్నాయని, ప్రతి ఒక్కరూ వాహనాలు నడిపేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బెజవాడ బార్ అసోసియేషన్ సభ్యులు రాజారత్నం, జయప్రభ, ఝాన్సీరాణి, శేఖర్ పాల్గొన్నారు.

పప్పులమిల్లు రోడ్డు మీదుగానే వంతెన

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పప్పులమిల్లు రోడ్డు మీదుగానే ఆర్‌యూబీ కానీ ఆర్‌ఓబీ కానీ నిర్మించటానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అధికారులను ఆదేశించారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో బుధవారం అధికారులతో కలిసి ఎమ్మెల్యే పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మధురానగర్ నేతాజీ కాలనీ, మధురానగర్ పప్పుల మిల్లు రోడ్డు ప్రాంతాలలో పర్యటించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నేతాజీ కాలనీ వాసులు తమ ప్రాంతం మీదుగానే ఆర్‌యూబీ, ఆరోబీ నిర్మించటం వల్ల పలు ఉత్పన్నం అయ్యే అవకాశం ఉందని, కావున పరిశలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మధురానగర్ పప్పులమిల్లు రోడ్డు విశాలంగా ఉండటం వల్ల ఆర్‌యూబీ, ఆర్‌ఓబీకు అనుకూలంగా ఉంటుందని అన్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పప్పులమిల్లు రోడ్డును పరిశీలించారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్తు

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించటం ద్వారా బంగారు భవిష్యత్తును సాధించవచ్చని మణిల్ ఇంజినీరింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. మల్లికార్జున అన్నారు. స్థానిక మాచవరం ఎస్‌ఆర్‌ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం పీజీ విద్యార్థులకు పరిశోధన అనంతరం విద్యా ఉద్యోగ అవకాశాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి మాట్లాడుతూ మనం నేర్చుకున్న విద్య ఎప్పుడూ వృథా కాదని.. విద్యార్థులు ఎప్పటికప్పుడు మారుతున్న కాలానుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని సూచించారు.

విశ్వసనీయతకు ప్రతీక

వైఎస్సార్ సీపీ పతాక..

- పోరాటాలే ఊపిరిగా సాగుతున్న పార్టీ ప్రస్థానం
- వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు
- వాడవాడలా ఘనంగా వేడుకలు



వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవంలో భాగంగా బీసెంట్ రోడ్డులో మహానేత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మల్లాది విష్ణు, అవుతు శ్రీశైలజ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దేశ చరిత్రలోనే వైఎస్సార్ సీపీ ప్రస్థానం చాలా ప్రత్యేకమని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. బుధవారం బీసెంట్ రోడ్డులోని ఎల్‌ఐసీ కార్యాలయం వద్ద వైఎస్సార్ సీపీ 15వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత మహానేత వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ వేడుకలలో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ అడపా శేషు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లు, పార్టీ వివిధ అనుబంధ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మల్లాది విష్ణు మాట్లాడుతూ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏవిధంగా సేవ చేయాలో.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎంత హుందాగా వ్యవహరించాలో మాజీ సీఎం వైఎస్ జగన్ నుంచే నేర్చుకోవాలన్నారు. సార్వత్రిక ఎన్నికలలో మూకుమ్మడిగా అన్ని పార్టీలు కలిసి పోటీ చేసినా.. వైఎస్సార్ సీపీ ఒంటరిగా వాటన్నింటినీ ఎదుర్కొందని అన్నారు.

వైఎస్సార్ ఆలోచన, స్ఫూర్తితో..

మహానేత వైఎస్సార్ ఆలోచన, స్ఫూర్తితో ఆనాడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పార్టీని స్థాపించారని మల్లాది విష్ణు పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఎదురైనా, ఆటుపోట్లను ఓర్చుకుంటూ తండ్రి ఆశయం కోసం పోరాడారన్నారు. తమ పార్టీని విశ్వసనీయతకు ప్రతీకగా పేర్కొన్నారు. దేశ చరిత్రలో 99 శాతం హామీలను అమలు చేసిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మాత్రమేనని చెప్పుకొచ్చారు. ఒక్క సెంట్రల్ నియోజకవర్గ పరిధిలోనే రూ. 440 కోట్ల సంక్షేమాన్ని అందజేసినట్లు వివరించారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకురావడంతో పాటు మహిళలను ఒక బలమైన శక్తిగా తీర్చిదిద్దారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల కాలంలో గ్రామ, వార్డు సచివాలయాలు ఏర్పాటు చేసి.. 1.34 లక్షల మందికి ఉద్యోగావకాశాలు కల్పించారన్నారు. కరోనా లాంటి విపత్తు సమయంలో.. వరదలు, తుపాన్లు వచ్చినప్పుడు ప్రజల ప్రాణాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి.. సంయమనంతో పరిస్థితులను చక్కదిద్ది వారిలో మనోస్థైర్యాన్ని నింపారని చెప్పారు. రాబోయే రోజుల్లో ప్రతిఒక్కరూ వైఎస్ జగన్ వెన్నంటే ఉంటూ ఆయన అడుగుజాడల్లో నడుస్తూ పార్టీ పటిష్టత కోసం పునరంకితమవ్వాలని పిలుపునిచ్చారు. కార్పొరేటర్లు శర్వాణీమూర్తి, కొండాయిగుంట మల్లేశ్వరి, ఇసరపు దేవి రాజా రమేష్, యరగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు, కుక్కల అనిత రమేష్, జానారెడ్డి, ఉద్ధంటి సునీత సురేష్, పార్టీ వివిధ అనుబంధ సంఘాల నేతలు పాల్గొన్నారు.



మహానేత వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పూనూరు గౌతంరెడ్డి

పేదల సంక్షేమమే ధ్యేయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం భగత్‌సింగ్ రోడ్డులోని వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రారంభించామన్నారు. పేద, బడుగు, బలహీన, కార్మిక వర్గాలకు అండగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు, పండ్లు పంపిణీ చేశారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ అవనిగడ్డ సునీత, యాదల శ్రీనివాసరావు, మహిళా నాయకులు లక్కంరాజు సునీత, మెహరాజ్, వర్మ, వికాస్, అనిల్ వర్మ, రాజా ఆటో కార్మికులు పాల్గొన్నారు.

ప్రజల గుండెల్లో వైఎస్సార్ సీపీ స్థానం సుస్థిరం

ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి.. రాష్ట్ర ప్రజల ఆర్థికాభివృద్ధికి దోహదపడిన వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రజల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకుందని ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా అన్నారు. వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని సింగ్‌నగర్ డాబాకొట్లు సెంటర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద బుధవారం నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి రుహుల్లా పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం రుహుల్లా మాట్లాడుతూ అధికారం ఉన్నా.. లేకపోయినా వైఎస్సార్ సీపీ ప్రజల పక్షాన పోరాడుతూనే ఉంటుందన్నారు. అనంతరం స్థానిక ప్రజలకు మిఠాయిలు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు ఎండీ హఫీజుల్లా, అమిత్, గెల్లిపోగు రాజు, యోహాను తదితరులు పాల్గొన్నారు.



జెండా ఎగురవేసి నినాదాలు చేస్తున్న ఎమ్మెల్సీ రుహుల్లా, నాయకులు

నగరంలోని థియేటర్లలో వీఎంసీ ఫైర్ సిబ్బంది తనిఖీలు



పటమట(విజయవాడతూర్పు): నిత్యం రద్దీగా ఉండే సినిమా థియేటర్లలో అగ్నిమాపక పరికరాలు ఏర్పాటు చేసుకోవటంతోపాటు వాటిని నిరంతరం నిర్వహణ చేయాలని వీఎంసీ అగ్నిమాపక సిబ్బంది నగరంలోని ఆయా థియేటర్ల యజమానులకు సూచించారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాలతో బుధవారం వీఎంసీ అగ్నిమాపక అధికారులు నగరంలోని దుర్గా కళామందిర్ థియేటర్, శైలజ థియేటర్ కాంప్లెక్స్, రాజ్ యువరాజ్ థియేటర్ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ ఫైర్ అధికారి మాల్యాద్రి, రీజనల్ ఫైర్ అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఫైర్ సేఫ్టీ సిస్టమ్స్ థియేటర్ వారితోనే ఆపరేట్ చేయించడమే కాకుండా థియేటర్ మొత్తంలో అగ్ని ప్రమాద నివారణ చర్యలు తీసుకున్నారా లేదా వంటి విషయాలపై క్షేత్రస్థాయిలో పరిశీలించామన్నారు. సరిగా లేని చోట్ల యజమానులను హెచ్చరించామన్నారు. స్టేషన్ ఫైర్ ఆఫీసర్ రాజా పాల్గొన్నారు.

ఉగాది కవితల పోటీకి ఆహ్వానం

విజయవాడ కల్చరల్: ఉగాది పండుగ సందర్భంగా జాతీయ స్థాయి కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు సంస్కారభారతి అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ, సుమధర కళానికేతన్ ప్రధాన కార్యదర్శి పసుమర్తి భాస్కర శర్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంస్కార భారతి సాంస్కృతిక సేవా సంస్థ, సుమధర కళానికేతన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీల్లో ఎవరైనా ఉచితంగా పాల్గొనవచ్చన్నారు. పంచ పరివర్తనలు(సామాజిక సమరసత, కుటుంబ వ్యవస్థ, స్వదేశీ జీవన విధానం, పర్యావరణ పరిరక్షణ, నాగరిక విలువలు) అంశంగా పోటీలుంటాయన్నారు. తగిన హామీ పత్రంతో 22వ తేదీ లోపు వాట్సప్(94410 30937)కు పంపాల్సి ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు సాయి శంకర్(83747 60657)ను సంప్రదించాల్సిందిగా సూచించారు.

యూసీడీ కొత్త లైన్లు వేయండి

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



డ్రెయినేజీని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ(యూసీడీ) కొత్త లైన్లు ఏర్పాటు చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన బుధవారం నగర పర్యటనలో భాగంగా ఆయన 13వ డివిజన్‌లోని న్యూ ఆర్టీసీ కాలనీ, ఎలక్ట్రిసిటీ కాలనీ, తోట వారి వీధి, కోనేరు వారి వీధి, జేడీ నగర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రామాయణపు వారి వీధి, తోట వారి వీధి, కృష్ణానగర్లో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పైప్ లైన్లు పాతవి కావటంతో తరచుగా సమస్యలు తలెత్తుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో కొత్త లైన్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏపీ రామారావు రోడ్డు పూర్తిగా పాడైపోటం గమనించిన కమిషనర్ కొత్త రోడ్డు వేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన ఎస్ఎస్ఎం స్కూల్ రోడ్డు విస్తరణ పనులు చేపట్టడానికి ప్రణాళికను సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బోర్ వాటర్ కాకుండా అక్కడున్న ప్రజలకు రామలింగేశ్వర నగర్ నుంచి కృష్ణానది నీరు అందేటట్లుగా చర్యలు తీసుకోవాలన్నారు. థెరీసా పార్క్‌లో కావలసిన వసతులు కల్పించాలన్నారు. వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లలు ఆడుకునే పరికరాలతో ఆధునికీకరించాలని ఆదేశించారు. ప్రతి వార్డు సచివాలయం పరిధిలో డీసిల్టింగ్ పనులు ప్రతిరోజు జరుగుతూనే ఉండాలన్నారు. ఈ పర్యటనలో కార్పొరేటర్ ముమ్మినేని ప్రసాద్, రెసిడెంట్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, జోనల్ కమిషనర్ కె. షమ్మి, ఇన్‌చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్ బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ గోపీనాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రాల్లో నీటి కొరత ఉండకూడదు

పటమట(విజయవాడతూర్పు): చలివేంద్రాలలో నీటి కొరత లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు పరివేక్షిస్తుండాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో బుధవారం ఇంజినీరింగ్ సిబ్బందితో చలివేంద్రాల నిర్వహణపై టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలోని మూడు సర్కిళ్ల పరిధిలో 77 చలివేంద్రాలు ఏర్పాటు చేశామని, వాటిలో తాగునీటి కొరత ఉండకూడదని, ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తూ తాగునీరు నిత్యం ప్రజలకు అందేలా చూసుకోవాలని సర్కిల్ ఈఈలను ఆదేశించారు. అధికారులు ఇప్పటికే ఏర్పాటు చేసిన చలివేంద్రాలే కాకుండా ఇంకా అవసరమైన ప్రాంతాలను పరిశీలించాలని ఆయా ప్రాంతాల్లో కూడా వెంటనే చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ మేరకు ఇంజినీరింగ్ సిబ్బంది కమిషనర్‌కు నివేదికను ఇచ్చారు. సర్కిల్–1 పరిధిలో 22, సర్కిల్–2 పరిధిలో 27, సర్కిల్–3 పరిధిలో 28, చలివేంద్రాలు ఏర్పాటు చేయగా, చలివేంద్రాల నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని, అసిస్టెంట్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, పర్యవేక్షిస్తూ ఫ్లోటింగ్ జనాభా ఎక్కువగా ఉండే ప్రాంతాలలో స్టాక్‌ను ఎప్పటికప్పుడు పెంచుకుంటూ ఉంటున్నామని కమిషనర్‌కు వివరణ ఇచ్చారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): విద్యారంగంలో ఉన్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంతో పాటు పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15వ తేదీన విజయవాడలో చేపట్టిన నిరసన దీక్షలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ పిలుపునిచ్చారు. గవర్నర్‌పేటలోని ఎం.బి. విజ్ఞాన కేంద్రంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో నిరసన దీక్షల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల15న నగరంలోని ధర్నాచౌక్‌లో నిరసన దీక్ష చేపడుతుందన్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ నాయకత్వం ఛలో విజయవాడ నిర్వహిస్తే ప్రభుత్వం చర్చలకు పిలిచి నెల రోజుల్లో సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని, కానీ 3 నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. రూ.5 వేల కోట్లు ఫీజు రీయింబర్స్ బకాయిలను చెల్లిస్తామని, జీవో నంబర్ 77 రద్దు చేస్తామని అనేక హామీలు ఇచ్చి ఇప్పటివరకు స్పందించక పోవడం దారుణమన్నారు. ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గత రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంతో విద్యార్థులపై ఫీజుల భారం పడుతుందని, ఫీజులు కట్టలేక అనేక మంది చదువుకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 15వ తేదీన జరిగే నిరసన దీక్షలో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్, ఉపాధ్యక్షులు ప్రణీత, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పార్టీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

- మధురానగర్ (విజయవాడ సెంట్రల్)

పదేళ్లలో మూడు సార్లు కిడ్నీ మార్పిడి

గర్భిణికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించిన వైద్యులు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ శరత్‌బాబు, చిత్రంలో కిడ్నీ మార్పిడి జరిగిన మహిళ

లబ్బీపేట(విజయవాడతూర్పు): గర్భిణిగా ఉన్న సమయంలో ఓ మహిళకు తలెత్తిన హార్మోన్ల అసమతుల్యత కారణంగా కిడ్నీలు ఫెయిల్యూర్‌కు దారి తీయగా.. పదేళ్లలో మూడు సార్లు కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సలు చేయాల్సి వచ్చింది. నంది గామకు చెందిన 30 ఏళ్ల మహిళకు ఇటీవల మూడోసారి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కిడ్నీ వ్యాధుల నిపుణులు డాక్టర్ జి. శరత్‌బాబు తెలిపారు. సూర్యారావుపేటలోని తమ ఆస్పత్రిలో బుధవారం నిర్వహించిన విలేకరులతో వివరాలు వెల్లడించారు. గర్భిణిగా ఉన్న సమయంలో తలెత్తిన సమస్య కారణంగా కిడ్నీలు దెబ్బతినగా 2015లో తొలుత తల్లి కిడ్నీ దానం చేయగా కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్స నిర్వహించినట్లు తెలిపారు. మరలా ఫెయిల్యూర్‌కు దారితీయగా రెండోసారి ఆమె భర్త కిడ్నీదానం చేసినట్లు తెలిపారు. తాజాగా తండ్రి కిడ్నీ దానం చేయడంతో ఆమెకు మూడోసారి కిడ్నీ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకున్నట్లు తెలిపారు. తనకు కిడ్నీలు దానం చేసిన కుటుంబ సభ్యులకు, విజయవంతంగా శస్త్ర చికిత్స నిర్వహించిన వైద్యులకు ఆ మహిళ కృతజ్ఞతలు తెలిపారు. ఆస్పత్రి చైర్మన్ జి. వెంకట్రావు, డాక్టర్ జి. ప్రశాంతి, యూరాలజిస్ట్ డాక్టర్ ధీరజ్ పాల్గొన్నారు.

లేడీస్ హాస్టళ్ల పరిసరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



విజయవాడస్పోర్ట్స్: మహిళల వసతి గృహాల పరిసరాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చాలని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ అడ్మిన్ డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) కె.జి.వి.సరిత ఆదేశించారు. మహిళ భద్రతలో భాగంగా జిల్లాలోని లేడీస్ హాస్టల్స్ యజమానులతో డీసీపీ సరిత కమిషనరేట్‌లో బుధవారం సమావేశమయ్యారు. మహిళల భద్రతకు పోలీస్ కమిషనరేట్ అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, సురక్ష కమిటీలు, ఈ–పహారా, సైబర్ సిటిజన్స్, అస్త్రం, విక్టిమ్ కాంపెన్‌సేషన్, క్లాడ్‌పెట్రోలింగ్, ట్రాఫిక్ అంబాసిడర్స్, ఫాల్కన్, చేరువ తదితర కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

బీరువా తాళాలు పగులగొట్టి చోరీ



ఘటనాస్థలిలో వివరాలు సేకరిస్తున్న అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో ఉన్న వారు నిద్రిస్తున్న సమయంలో బీరువా తాళాలు పగులగొట్టి 8 కాసుల బంగారు ఆభరణాలు చోరీ చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీనగర్ ఒకటో లైన్‌కు చెందిన కనకయ్య శ్రీవాణి తమ కుటుంబ సభ్యులతో కలిసి నివసిస్తున్నారు. ఈనెల 11వ తేదీ మంగళవారం రాత్రి 11 గంటలకు కుటుంబ సభ్యులతో కలిసి నిద్రపోయారు. 12వ తేదీ బుధవారం తెల్లవారుజామున వాష్‌రూమ్‌కు వెళ్లటానికి నిద్రలేచిన శ్రీవాణి అత్త డోర్ తీసేందుకు ప్రయత్నించారు. కానీ డోర్ రాకపోవటంతో డయల్ 100కు ఫోన్ చేశారు. దీంతో పోలీసులు వచ్చి డోర్ ఓపెన్ చేశారు. దీంతో పక్కనే ఉన్న బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా బీరువా తాళాలు పగుల కొట్టి ఉన్నాయి. పరిశీలించగా బీరువా లాకర్‌లో ఉంచిన 8 కాసుల బంగారు ఆభరణాలు కనిపించలేదు. దీంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ శ్రీనివాసరావు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

■ మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు అజయ్ హైస్కూల్‌లో ఈనెల 14వ తేదీ శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు స్కూల్ డైరెక్టర్ ఏపుగంటి సాయి కృష్ణ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి ఒంటి గంట వరకు వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేస్తారన్నారు. ఆసక్తి కలిగిన వారు తమ పేర్లు అజయ్ హైస్కూల్‌లో నమోదు చేసుకోవాల్సిందిగా కోరారు.

కూటమికి ఫీజులెగిరేలా..

ఉవ్వెత్తున ఎగసిన యువతరంగం



విద్యార్థులతో కలిసి కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఇతర నాయకులు





మ్యూజియం వద్ద బారికేడ్లు పెట్టి నాయకులు, విద్యార్థులను అడ్డుకుంటున్న పోలీసులు



కూటమి తొమ్మిది నెలల పాలనపై యువాగ్రహం నిరసన గళమై నినదించింది. ఫీజులివ్వని బాబు సర్కారుకు ఫ్యూజులు మాడిపోయేలా విద్యార్థిలోకం నిప్పులు చెరిగింది. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ మాయ హామీలతో గద్దెనెక్కిన దొంగ ప్రభుత్వంపై సింహనాదమై గర్జించింది. ఎన్ని ఆంక్షలు విధించినా.. పోలీసులు అడుగడుగునా అడ్డంకులు సృష్టించినా లెక్కచేయక పదం పదం కలిపి కదం తొక్కింది. విజయవాడలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహించిన యువత పోరులో విద్యార్థులు, నిరుద్యోగులు, యువతీ యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ







విద్యార్థులతో కలిసి ర్యాలీగా వస్తున్న మేయర్, డెప్యూటీ మేయర్లు